



'ఒకవిధంగా రాయబారమే అనుకోండి. మీ వసంతకు వీలైనంత త్వరలో పెళ్లి చేసెయ్యండి. ఇవిగో మీ అమ్మాయికి వచ్చిన మూడు ప్రేమలేఖలు! అయితే ఇటువంటి వ్యవహారాల్లో తలదూర్చకుండానే, మీ నేత్రాలమీదుగా సలక్షణంగా పెళ్ళిచేసుకోవాలని ఉందని మీ అమ్మాయి చెప్పమంది. మోమాట భయంగా ఉన్నా, వసంతమాట కాదనలేక మీతో చొరవ తీసుకొని చెప్పినందుకు మన్నించండి.' అప్పజెప్పినట్లుగా శారద అన్న మాటలకి విస్తుపోయింది వసంత తల్లి.

'ఏం చోద్యమే—నాకు పెళ్ళిచెయ్యండి అని నోరువిప్పి అడగడం! మాకాలంలో ఎరుగుదుమా యిటువంటి వింత?' తేలికగా అన్నా, ఆమాటల వెనకాల ఘోరమైన నిస్పృహాయుత, కడుపు తరుక్కుపోయే ఆ తల్లివేదనా—శారద గ్రహించక పోలేదు. గడుసుగా అంది సమాధానంగా.—'మీకయితే ముచ్చటగా మూడుముళ్ళూ పదమూడో ఏటనే పడినందుకు అడగవలసిన అవసరం లేపోయింది కాని మీవసంతకిప్పుడు ఇరవైయేళ్ళు.' వసంతతల్లి తిరిగి ఏమంటుందో కూడా వినకుండా శారద పెరటిలో కూర్చున్న వసంత దగ్గరకు పరుగెత్తింది.

'...ఇదండీ సంగతి!' మొగుడిచేతిలో మూడు ఉత్తరాలూ పెట్టి, తన బాధ్యత తీరిపోయినట్లు వంటయింట్లోకి దారి తీసింది, వసంత తల్లి.

నూటికి నెలకి ఆరు రూపాయల చొప్పున వెయ్యికి ఏడాదికి ఎంత వడ్డీ అవుతుంది?...అని ఉత్సాహంగా స్కూలు కుర్రాళ్ళకి లెక్కలు చెప్పే రామనాథం మాస్టారు ఒక్కసారిగా డీలా పడిపోయాడు. 'పెద్దకూతురికి మూడు ప్రేమ లేఖలు! దానికి పెళ్ళిచెయ్యాలి—ఎంత కట్నం—ఎంత అప్పు—ఎంత వడ్డీ? ఉన్నది ఒక ఎకరం పొలం, పాతకొంపా. కన్నది నలుగురు సంతానం!'

మూడ్నాళ్ళకి వసంత బోధంటుంది—మూడు ప్రేమ లేఖలు ఊరికినే రాలేదు మరి చక్కదనానికేమీ తక్కువ లేదు—బి. ఏ. ఆఖరి సంవత్సరం చదువుతోంది కల్లా కపటం లేని మనిషి—అందుకనే బలహీన తలకి లొంగి కాలు జారుతుందేమోనన్న భయంకొద్దీ పెళ్లి చేసెయ్యమని అడిగింది. అన్నీ బాగున్నాయి కాని, వరుళ్ళు మట్టుకు రామనాథాని కందుబాటులో లేరు.

ప్రేమ వివాహాల్లో కట్నాల సమస్య ఉండరాదే?—రామనాథం మస్తిష్కంలో ఓ చిన్నమెరుపు మెరిసింది.

—'చూడబ్బాయీ, రాజశేఖరం! నువ్వు మా వసంతకి వ్రాసిన ఉత్తరం చూశాను...' రామనాథం ఆగాడు. 'అబ్బెబ్బె లేదు...' రాజశేఖరం కంగారుపడిపోయాడు. అతని భుజంమీద చెయ్యివేస్తూ

రామనాథం అన్నాడు. 'నువ్వు కంగారు పడ నవసరంలేదు. నీ ప్రేమను అడ్డు దలచుకోలేదు. నా వసంత నిచ్చి పెళ్లి చేస్తాను—ఏమంటావు?'

రాజశేఖరం తెల్లమొహం వేశాడు. 'వర్ణాంతర వివాహమంటే మా వాళ్లు డొక్కచీలుస్తారు!' అతి కష్టంమీద అనగలిగాడు.

రామనాథానికి కోపమొచ్చింది. తీవ్రంగా అడిగాడు. 'మరి మా వసంతకు ఉత్తరం వ్రాసిన దెందుకని?'

'ప్రేమ...కాదు కాదు సరదా...కాదు...' రాజశేఖరానికి మరి మాటలు రాలేదు. సైకిలు మీదకు ఒక్క గెంతు గెంతి ఉడాయించాడు.—

—'ఏమోయ్, చక్రవర్తీ! మా వసంతకు నిన్ను పెళ్లిచేసుకోడానికి ఏమీ అభ్యంతరంలేదు. మీవంశం, పుట్టు పూర్వోత్తరాలూ నాకు నచ్చాయి కాబట్టి నాకూ అభ్యంతరం లేదు. నీ తల్లిదండ్రులతో మాట్లాడమంటావా మరి?' డొంక తిరుగుడులేకుండా సూటిగా రామనాథం అడిగిన ప్రశ్నకి, చక్రవర్తి తడబడి పోయాడు.

'ఇప్పుడు పెళ్లి మాట ఎత్తితే నా ముక్కలు విరుగుతాయి!' చక్రవర్తి మూలుగు తున్నట్లుగా అన్నాడు.

'అంత ధైర్యం లేనివాడివి ఉత్తరాలు వ్రాయడ మెందుకనో?' రామనాథం హేళనగా అన్నాడు.

'మీదగ్గర దాపరిక మెందుకు? స్నేహితులతో పందెం వచ్చి ఉత్తరం వ్రాశాను. దయచేసి మావాళ్లతో చెప్పకండి!' చక్రవర్తి చేతులెత్తి నమస్కారం పడేసి రామనాథం తేరుకొనే లోగా అక్కణ్నించి జారుకొన్నాడు—

'—మా వసంతకు వ్రాసిన ఉత్తరం చదివి నీవేదన అర్థం చేసుకొన్నానోయ్, కృష్ణమూర్తీ! ఏదో పాతకాలపు వాడినైనా, ఆధునిక సాహిత్యపు ప్రభావం అనుకో—చూస్తున్న సినిమాల ప్రభావం అనుకో—మీయువతరం ప్రేమలమీద నాకు చాలా అభిమాన మేర్పడింది. నిన్ను మా అల్లుడిగా చేసుకోడం మాకేమీ అభ్యంతరం లేదు. ఏమంటావు?' క్లాసులో కుర్రాడికి సూత్రం చెప్పి, లెక్క అడిగినట్లుగానే అడిగాడు రామనాథం.

'నాకు మేనమామకూతురు సిద్ధంగా కూర్చుంది. ఈపెళ్లికి మావాళ్లు ఒప్పుకోరు. క్ష మి ం చ ం డి!' కృష్ణమూర్తి దిక్కులు చూస్తూ సమాధానం చెప్పాడు.

'మరి ప్రేమలేఖ ఎవర్ని ఉద్ధరిద్దామని వ్రాసినట్టు?' రామనాథం అడిగాడు, రాబోయే ఏడుపును ఆపుకొంటూ.

'ఏదో ఉద్రేకంలో వ్రాశాను క్షమించండి!' వెనక్కి తిరిగి చూడకుండా పరుగుచ్చుకొన్నాడు కృష్ణమూర్తి.—


బొమ్మలాంటి తన వసంతను నిజంగా ఆటబొమ్మనుచేసి ఆడుకొన్నారు! రామనాథానికి కోపం ముంచెత్తుకొచ్చింది.

'...జరిగిన సంగతి యిదండీ! ఆడపిల్లల జీవితాలతో ఇలా చెలగాటాలాడడం ఏమంత సబబైన పని?' రామనాథం చెప్పిన సంగతులన్నీ శ్రద్ధగా ఆలకించాడు ప్రిన్సిపాల్ శేషగిరి.

'నానాటికి విద్యార్థి లోకంలో క్రమశిక్షణ దిగజారి పోతోంది. ఏ రోజు ఏం గొడవ వస్తుందేమోనని భయపడని క్షణం లేదు. అయినా ఆ మూడు ఉత్తరాలూ నా దగ్గర వదలివెళ్ళండి. నే చెయ్యగలిగింది చేస్తాను' శే ష గి రి సానుభూతి చూపిస్తూ, రామనాథాన్ని సాగనంపాడు.

ముగ్గురు కొ డు కు లూ, ముగ్గురు తండ్రులూ ప్రి న్సి పా ల్ బల్లచుట్టూ కూర్చున్నారు. శేషగిరి కళ్లు నిప్పులు వెదజల్లుతున్నాయి. '...మీరూ మాట్లాడరేమండీ? ఆ అమ్మాయి నిలా ఆటవస్తువులా ఆడించడం ఎంత నీచమైన పనో ఆలోచించండి. మీ ప్రబుద్ధులు వ్రాసిన ఉత్తరాల్ని నమ్మి, నిజంగా వివాహం చేసు

ఈ బొమ్మలోని మొత్తం త్రిభుజాలు ఎన్ని?



(జవాబు 64వ పేజీచూడండి)

కొనే ఉద్దేశ్యం ఉందేమోనని పాపం ఆ మాష్టారు ఆభిజాత్యాన్ని చంపుకొని, మనసువిప్పి తన అంగీకారం తెలియచేసినందుకు–ఆయనకు మంచి సమాధానాలే లభించాయి! యిప్పటికయినా మించింది లేదు. మీలో ఎవరు వసంతని స్వీకరించినా చాలా సంతోషించదగ్గ విషయం.' శేషగిరి ఆగి, అందరివైపూ ప్రశ్నార్థకంగా చూశాడు.

'మా వాళ్ళమీద మాకూ ఎన్నో ఆశలుంటాయి. కట్నాలనీ—కలిసిన సంబంధాలనీ. అయినా కుర్రాళ్ళు తెలియక చేసిన పనికి మమ్మల్నిలా బలవంతపెట్టడం మీకు భావ్యం కాదు!' ఓ హీరో తండ్రి కాస్త గట్టిగానే సమాధానమిచ్చాడు.

'అయితే మీ వాళ్ళు తెలియక చేసిన పనికి తగిన చర్యే తీసుకొంటాను. మీరందరూ వెళ్ళవచ్చు.'

'ప్రిన్సిపాల్‌గారూ, అది మీరు అనుకొన్నంత సులభం కాదేమో?' చక్రవర్తి కొంచెం తలబిరుసుగానే అన్నాడు.

'ఈ విషయంలో నేను జంకేది లేదు. మీరు ముగ్గురూ వ్రాసిన ప్రేమలేఖలు—దస్తూరీ సంతకాలతో సహా రుజావు కాబడ్డాయి. వాటికి ఫోటోకాపీలు తీయించి అన్ని నోటీసు బోర్డుల్లోనూ ప్రదర్శిస్తాను. ప్రేమలేఖలు వ్రాయడమే కాని, వివాహ సమస్య తల ఎత్తేసరికి జారుకొనే చవటలనీ, అప్రయోజకులనీ అందరకూ తెలియచేస్తాను. తోటి విద్యార్థినిని ఆడించి అవమానించినందుకు సస్పెండ్ చేస్తాను. రేపు ఉదయం కాలేజీలో ఉన్న పన్నెండువందల మందికీ మీ హీరోలపని తెలియచేస్తే, సాయంత్రం అయ్యేసరికి ఈ ఊరి అరవైవేల జనాభా మీ గురించే మాట్లాడుకొంటుంది. విద్యార్థిలోకం సానుభూతి వసంతవైపో, లేక మీవైపో—చూడాలని నాకు చాలా సరదాగా ఉంది! మీరింక వెళ్ళవచ్చు' శేషగిరి ఉగ్రస్వరూపం చూసి ఆ ఆరుగురూ బిక్కమొహాలతో అక్కణ్ణించి చల్లగా జారుకొన్నారు. బయటకు వెళ్ళినతర్వాత నోరు జారిన చక్రవర్తిమీద విరుచుకు పడ్డారందరూ.

ఆ రాత్రి ఏడూ–పదిగంటల మధ్య ముగ్గురు తండ్రులూ ఒకరితర్వాత ఒకరూ, ఒకరికి తెలియకుండా మరొకరూ శేషగిరి యింటిమెట్లు ఎక్కిదిగారు.

మర్నాడుదయం రామనాథానికి నాలుగు ఉత్తరాలందాయి. 'అజ్ఞానంకొద్దీ వాళ్ళు చేసిన పనికి తీవ్రమైన దండన విధించి, వాళ్ళ భవిష్యత్తుని పాడుచెయ్యడానికి నేను జంకినమాట వాస్తవం. ముగ్గురు తండ్రులూ యిచ్చిన లిఖితపూర్వకమైన క్షమార్పణలు యిందుమూలముగా అందచేస్తున్నాను...' రామనాథం చిన్నగా నవ్వుకొన్నాడు ప్రిన్సిపాల్ ఉత్తరానికి.

'చూడమ్మా వసంతా! ఇంకొక రెండు నెలల్లో నీ చదువు పూర్తవుతుంది. ఏదో ఉద్యోగంలో ప్రవేశించు. మన దేశం పూర్తిగా గొడ్డుపోలేదు. నీకు నచ్చినవాడూ, అభ్యుదయభావాలు కలవాడూ నీ అన్వేషణలో లభించకపోడు. ఆ శుభ ఘడియలకోసం దైవాన్ని ప్రార్థించడం తప్ప నేను చెయ్యగలిగింది మరేమీ లేదు.' రామనాథం వసంత కివ్వగలిగింది ఈ సలహా మాత్రమే.

మరో నెలకల్లా శేషగిరి కూతురిపెళ్ళి శుభలేఖ రామనాథానికి అందింది. ఏదో ఫిర్యాదురూపేణా ఓ సారి ప్రిన్సిపాల్‌ని కలుసుకొన్నంత మాత్రాన — జ్ఞాపకం ఉంచుకొని శుభలేఖ పంపినందుకు రామనాథం ఆశ్చర్యపోయాడు.

అయితే — వసంత కొచ్చిన మూడు ఉత్తరాలూ, తనకూతురుమెళ్ళో పడే మూడుముళ్ళకీ ఒప్పుకొన్నకట్నం పదివేలలో, ఓ ఆరువేల రూపాయలు సంపాదించి పెట్టాయన్న కృతజ్ఞతని తెలుపుకోడంకోసం, ప్రిన్సిపాల్ శుభలేఖ పంపాడని లెక్కల మేష్టారికి ఏం తెలుసు?! ●

కూరలూ గుణాలూ!

# కోడిగ్రుడ్లు

పెద్దవి క్రొద్ది దినాల క్రిందట పెట్టినవి మంచివి. ఇవి శైత్యాన్ని అణుస్తాయి. వీర్యపుష్టిని, దేహపుష్టిని చేకూరుస్తాయి. రక్తాన్ని వృద్ధి పొందిస్తాయి. ఈ గ్రుడ్లలోని తెల్లసొన చలవచేసి నీరుపెట్టును. పచ్చసొన సమశీతోష్ణస్థితి కలుగజేస్తుంది. హృదయానికి, మెదడుకు బలాన్ని యిస్తాయి. పుంస్త్వమును కలుగజేస్తాయి. అల్లపురసంతోను, నీరుల్లిపాయలతోను వండి తినడం శ్రేష్ఠం!... మిరియపుపొడి జల్లుకొని తినడం కూడా శ్రేష్ఠమయినదే!

శరీరం నుండి రక్తం తీయడం, గాయాలు వలన రక్తం నష్టమవడం, రక్తస్రావం మొదలగు వాని వలన కలిగిన రక్తహీనత గలవారికి, కాయలాపడి లేచిన వారికి, నీరసంగా వున్న వాళ్ళకి యిచ్చిన రక్తపుష్టిని, బలాన్ని చేకూరుస్తాయి.

ప్రేగులను, రొమ్మును, మూత్రపు సంచిని శుభ్ర పరుస్తాయి. కిడ్నీస్‌లోను, మూత్రపు సంచిలోను పుళ్ళు వ్రణాలను తగ్గించడానికి దోహదమిస్తాయి. మూత్రపు సంచిలోని కంతులను, సుద్దను తొలగించడానికి తోడ్పడతాయి.

విష పురుగులు ఏవైనా కుట్టినచో— కుట్టిన చోట కోడిగ్రుడ్డులోని చందమామ బాగాన్ని పెట్టి— మరో కోడిగ్రుడ్డులోని చందమామ బాగాన్ని ఆ వ్యక్తిచే తినిపించినచో విషం చాలావరకూ విరిగిపోతుంది. చందమామను శిరంసాంబ్రాణితో యిచ్చిన పురాణపు ఒగర్పుగం దగ్గు తగ్గుతుంది.

ప్రతిదినం అమితంగా కోడిగ్రుడ్లు తిన్నట్లయితే కిడ్నీస్‌లో రాళ్ళు పడతాయి. శరీర కాంతి చెడిపోయి తెల్లని సోభి మచ్చలు పడతాయి. సామాన్యంగా కోడిగ్రుడ్డు వాతాన్ని, శ్లేష్మన్ని చేస్తుంది. ప్రేవులలో వాతాన్ని పుట్టిస్తుంది. కఫాన్ని పెంచుతుంది. కడుపులో నీరు ఎక్కువగా వుండేవారికి జబ్బు చేస్తుంది.

దీని దుర్గుణాలకు విరుగుళ్ళు:—1. మిరప కాయలు. 2. దాల్చిన చెక్క, 3. ఉష్ణ శరీరులకు పుల్లని పదార్థాలు 4 శీతశరీరులకు కలకండ 5 సిరికా, 6. వేడి[illegible] ధములు.

— సేకరణ ఆకుండి నారాయణమూర్తి